అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 21 జూన్ 2023

ఆర్థిక ఇబ్బందులతో దర్జీ ఆత్మహత్య

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన దరబస్తు శ్రీనివాస్ (45)ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దరబస్తు శ్రీనివాస్ దర్జీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మిషిన్ కుడుతున్నా అప్పులు మాత్రం తప్పడం లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గంగారాం తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని దయానంద్ నగర్ కాలనీలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రమేష్ ఆదేశానుసారం చేపట్టిన కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒక అంటువ్యాధి అని, ఇది గాలి తుంపర్ల ద్వారా ఒకరి నుండి మరొకరికి సోకుతుందని తెలిపారు. కాబట్టి ప్రజలు దీనిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిబి పర్యవేక్షకుడు సోమశేఖర్, టిబి పర్యవేక్షకురాలు లావణ్య, రాజవ్వ కవిత ,మమత ,పద్మలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఎమ్మెల్యేలకు నిరసన సెగ

- అడగడం కాదు.. ప్రశ్నిద్దామంటూ ఫ్లెక్సీల ఏర్పాటు
- హామీలు అమలు చేయని ఎమ్మెల్యే.. మా గ్రామానికి రావొద్దంటూ నిరసన

నవతెలంగాణ-నందిపేట్/మోపాల్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో ఎమ్మెల్యేలకు నిరసన సెగ తగులుతుంది. హామీల అమలుపై గ్రామస్తులు వివిధ రూపాల్లో ప్రశ్నిస్తు తమ నిరసనను వ్యక్తం చేశారు. తాజాగా నందిపేట్ మండలంలోని తల్వేద గ్రామంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిశాయి. మంగళవారం నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పర్యటన నిమిత్తం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేశావని, రైతులకు రుణమాఫీ దళితులకు దళిత బంధు బీసీలకు బీసీ బంధు, నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. అలాగే బీడీ పెన్షన్‌లు కొత్తవి, రేషన్ కార్డుల మంజూరు ఎక్కడ చేశారని ప్రశ్నించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు.



నందిపేట్ మండలం తల్వేదలో..

మా ఊరికి రావొద్దు

మోపాల్ : ఇచ్చిన హామీలను అమలు చేయని ఎమ్మెల్యే మా ఊరికి రావొద్దని మోపాల్ మండలంలోని బాడ్సి గ్రామస్తులు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మేనిఫెస్టో ప్రకారం తమ గ్రామానికి ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.




మోపాల్ మండలం బాడ్సీలో..

‘ఏకగ్రీవం’కు ఎగనామం

- పది లక్షల ఊసేత్తని సర్కారు
- ఈ యేడాదితో పాలన పూర్తి
- నిధులివ్వాలని కోరుతున్న సర్పంచులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



విమర్శలు-ప్రతివిమర్శలు, ఆరోపణలు- ప్రత్యారోపణలు, వివాదాలు, ఘర్షణలు ఇవన్నీ సాధారణంగా ఎన్నికల్లో చూస్తుంటాం. వార్డు కమిటీ సభ్యుడి నుంచి ఎమ్మెల్యే, ఎంపీల ఎన్నికల వరకు సర్వ సాధారణం. కానీ ఒక గ్రామంలోని ప్రజలంతా ఏకమై.. 'మాకు ఎన్నికలు వద్దు. అభివృద్ధే ముఖ్యం' 'మా గ్రామాల్లో ఘర్షణ వాతావరణం కాదు ఆహ్లాద వాతావరణం కావాలి' అని పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే.. ఆ పంచాయతీలకు ప్రోత్సాహకం ఇస్తామని సర్కారు ఎగనామం పెట్టింది. ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమైన గ్రామాలకు అభివృద్ధిలో సాయం చేస్తామని దాట వేసింది. ఇప్పటికే ఏకగ్రీవ పంచాయతీల పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయ్యాయి. మరో యేడాదితో పాలకవర్గం గడువు కూడా ముగియనుంది.

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 530 పంచాయతీలున్నాయి. నాలుగేండ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 120 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల నగదు అందిస్తామని ఆ సమయంలో సర్కారు హామీనిచ్చింది. ఎన్నికల కన్నా.. అభివృద్ధి మిన్న అనే నినాదంతో ముందుకు సాగాయి. కానీ నాలుగు సంవత్సరాలు దాటినా అతీగతీ లేదు. విచిత్రమేమిటంటే.. అసలు రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలను పూర్తిగా మరిచిపోయింది. ఇప్పటి వరకు ఇందుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. ప్రభుత్వ నజరానా కోసం గత నాలుగేళ్లుగా ఈ పంచాయతీలు ఎదురు చూస్తున్నాయి. గ్రామ పంచాయతీల ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే ఉండడంతో ఇక డబ్బులు వస్తాయో రావోనని ఆందోళన నెలకొంది. జిల్లాలోని పంచాయతీలకు సుమారు రూ.12 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలోని పంచాయతీలు తీవ్ర ఆర్థిక కష్టాల్లో మునిగాయి. 15వ ఆర్థికసంఘం నుంచి స్టేట్ ఫైనాన్స్ నుంచి మార్చి నెల నుంచి నయాపైసా అందలేదు. అభివృద్ధి పనులన్నీ అటకెక్కాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను గ్రామాల్లో విజయవంతం చేసేందుకు అప్పులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ కార్మికుల జీతభత్యాలు కూడా ఇవ్వలేని స్థితిలోకి పంచాయతీలు చేరాయి. ప్రస్తుతం ఈ ప్రోత్సాహం అందజేస్తే ఆర్థికంగా ఉపయోగపడుతుందని సర్పంచులు భావిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2019 ఎన్నికల్లో తండాలను పంచాయతీలకు మార్చిన విషయం తెలిసిందే. అయితే జనాభాకనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు ఈ చిన్న పంచాయతీలకు సరిపోవడం లేదు. జనాభా తక్కువ ఉండటంతో ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూళ్లు కూడా అంతంతే ఉంది. ఈ నేపథ్యంలో ఏకగ్రీవ పంచాయతీలకు సర్కారు ఇస్తామన్న రూ.10 లక్షలు అందజేస్తే ఆర్థికంగా పెద్ద ఊరట కలుగుతుంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు

జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు నిధులకు సంబంధించి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలూ వెలువడ లేదు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తే ఆ నిధులు పంచాయతీలకు బదిలీ చేస్తాం.

స్వాహా చేసిన డబ్బులు రికవరీ చేయించాలి

- వీవోఏపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి

మహిళా సంఘాలలో స్వాహా చేసిన డబ్బులు వెంటనే రికవరీ చేయించాలని మహిళలు నినాదాలు చేశారు. తాడ్వాయి మండలం నందివాడ గ్రామానికి చెందిన మహిళా సంఘ సభ్యులు 100 మంది కలెక్టర్ కార్యాలయానికి మంగళవారం తరలివచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గంట సేపు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో మాట్లాడారు. గ్రామ సంఘాలలో స్వాహా చేసిన రూ. 37 లక్షలు గ్రామానికి చెందిన వివోఏ బాబా గౌడ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డబ్బులు చెల్లించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రూపాయి రూపాయి జమ చేసుకుంటే సంఘాలలో నిధులను వివోఏగా బాధ్యతలు నిర్వహిస్తున్న బాబా గౌడ్ మహిళలకు తెలియకుండా డబ్బులను తమ కుటుంబ సభ్యుల అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు. అధికారుల అండదండలతోనే బాబా గౌడ్ నిధుల స్వాహాకు పాల్పడినట్లు మహిళలు ఆరోపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ గ్రామ సంఘాలలో స్వాహా అయిన డబ్బులను రికవరీ చేయడానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు మహిళలకు హామీ ఇచ్చారు. వెంటనే బాబా గౌడుతో బాండ్ రాయించాలని పీడి ని ఆదేశించారు, బాబా గౌడ్‌తో బాండు రాయిస్తూ బాబా గౌడ్ కుటుంబ సభ్యుల సంతకాలు తీసుకోవాలని కలెక్టర్ పీడికి సూచించారు. లేని యెడల రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ఆస్తులు జప్తు చేసి డబ్బులు రికవరీ చేయిస్తామని మహిళా సంఘాల సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి వినోద్ గౌడ్ ,గ్రామ సంఘం అధ్యక్షురాలు మమత, గ్రామ పెద్దలు చిన్నోళ్ల రాజయ్య స్వామి, భాస్కర్ తదితల పాల్గొన్నారు.

నీరు, నేల కలుషితం

- కెమికల్ పరిశ్రమను మూసివేయాలని ముట్టడించిన గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

కెమికల్ ఫ్యాక్టరీ వల్ల గ్రామాల్లోని నీరు, నేల కలుషితమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ కలుషిత జలాలు చెరువుల్లో వదులుతుండటంతో నీరు కలుషితమై చేపలు మృతిచెందుతున్నాయని, నేల కలుషితమవుతుందని అన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని కాచాపూర్ గ్రామస్తులు మంగళవారం మండల పరిధిలోగల ఎంఎస్ఎన్ కెమికల్ పరిశ్రమను ముట్టడించారు. దీంతో ఫ్యాక్టరీ వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమను మూసివేయాలని ఫ్యాక్టరీ వల్ల గ్రామానికి తీవ్ర ప్రమాదం ఉందని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మైపాల్ తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటి నుండి ఆడ మగ తేడా లేకుండా పెద్దఎత్తున తరలివచ్చారు. ఫ్యాక్టరీ యాజమాన్యం చర్చలకు వస్తము అని చెప్పి రాకపోవడంతో గ్రామస్తులు వారి తీరు పై ఆగ్రహానికి గురై ట్రాక్టర్ల పై ఫ్యాక్టరీ వద్దకు వెళ్లారు. అక్కడ ఫ్యాక్టరీని ముట్టడించి యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కామారెడ్డి డీఎస్పీ సురేష్, సిఐ తిరుపయ్య, ఎస్సై ఆనంద్‌గౌడ్ పెద్ద ఎత్తున పోలీసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులు కొందరు గేటు ఎక్కి లోనికి వెళ్లేందుకు ప్రయత్నించి ఫ్యాక్టరీ సంబంధించిన అధికారులు గేటు వద్దకు రావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీకి సంబంధించిన వ్యక్తి ధర్న వద్దకు వచ్చి మాట్లాడుతూ ఫ్యాక్టరీ పరిధిలోని కాచాపూర్, పెద్ద మల్లారెడ్డి, మాందాపూర్, సంగమేశ్వర్, అంతంపల్లి గ్రామాలకు చెందిన 5 గురు చొప్పున కమిటీ వేసుకోవాలని, డీఎస్పీ సురేష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి తథానంతరం చర్చించుకుందామని తెలిపారు. పూర్తి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫ్యాక్టరీ వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 15 రోజుల్లోగా సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులు ఆందోళన విరమించారు.


ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపట్టి నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

రోడ్ల అభివృద్ధికి రూ.335 కోట్లు

- సెంట్రల్ లైటింగ్‌కు రూ.32 కోట్లు
- ఎమ్మెల్యే హన్మంత్‌షిండే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-మద్నూర్/పిట్లం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ హయంలో జుక్కల్ నియోజకవర్గం లోని ఆర్ అండ్ బి రోడ్ల అభివృద్ధికి 335 కోట్లు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే హన్మంత్‌షిండే తెలిపారు. ప్రజల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని అన్నారు. మంగళవారం మద్నూర్ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మద్నూర్ మండల కేంద్రంలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం తొమ్మిది కోట్లు మంజూరు చేయించానని, త్వరలోనే మద్నూర్ మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. సెంటర్ లైటింగ్ ఏర్పాటు కోసం గతంలో బిచ్కుంద మండల కేంద్రానికి 12 కోట్లు మంజూరు కాగా ప్రస్తుతం ఈనెల 15న జీవో ఆర్టి నంబర్ 225 ప్రకారం జుక్కల్ నియోజకవర్గం లోని మద్నూర్ మండలానికి 9 కోట్లు జుక్కల్ మండలానికి 4.50 కోట్లు నిజాంసాగర్ మండలానికి 3 కోట్లు పిట్లం మండలానికి 12 కోట్లు పెద్ద కోడప్‌గల్ మండలానికి 3.50 కోట్లు ఈ విధంగా మొత్తం 32 కోట్లు గతంలో బిచ్కుంద మండలానికి మంజూరైన 12 కోట్లతో మొత్తం 44 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జుక్కల్ నియోజకవర్గం ప్రజల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ సురేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బస్సీ పటేల్, మున్నూరు కాపు సంఘం, అధ్యక్షులు డాక్టర్ బండి వార్, విజయ్ ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్ వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పేదింటి కుటుంబాలకు వరం

పిట్లం : కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు పేదింటి మహిళలకు ఓ వరం లాంటివని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళ వారం మండల పరిషత్ కార్యాలయంలో 36 మందికి కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచులు , ఎంపీటీసీలు , తహసిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యూలర్ చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్రంలో పనిచేస్తున్న 12 విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులను తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో రెగ్యులరైజ్ చేయాలని భిక్కనూర్ మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ నారాయణ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ ఎనలేని పోరాటం చేశారని తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తమ బతుకులలో మార్పులు వస్తాయని ఆశించిన ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తమను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాలాద్రి, సునీత, నరసయ్య, వైశాలి శ్రీమాతా, రమాదేవి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

మినీ బస్సులతో.. మెనీ తంటాలు

- పల్లెల్లోకి ప్రయివేటు స్కూల్ బస్సులు
- పరిమితికి మించి విద్యార్థుల ప్రయాణాలు
- ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా?

నవతెలంగాణ-నందిపేట్

పల్లెల్లో ప్రయివేటు స్కూళ్ల మినీ బస్సులు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రతిరోజూ ఉదయం హారన్ మోతాలతో హోరెత్తిస్తున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కాలం చెల్లిన బస్సులు తిప్పుతూ కాసులు దండుకుంటున్నారు. పైగా స్కూల్ బస్సులకు ఉండాల్సిన ఏ నిబంధనా ఈ యజమానులు పాటించకపోవడం గమనార్హం. అయితే జిల్లాలో స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని, సుమారు 400 బస్సుల ఫిట్‌నెస్‌లేకపోవడంతో రద్దు చేశామని జిల్లా రవాణాశాఖాధికారి వెంటకరమణ తెలిపారు.

నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా సుమారు 460 ప్రయివేటు పాఠశాలలు, 1200 వరకు ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు న్నాయి. విద్యార్థులకు నాణ్యమై న విద్య అందిం చాలన్న ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాల నుంచి సైతం తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టణాలకు పంపి విద్యా భ్యాస్యం చేయిస్తున్నారు. ఇదే అదునుగా కొన్ని యజమాన్యాలు విద్యార్థులను పాఠ శాలలకు తీసుకొచ్చేందుకు ఫిట్‌నెస్‌లేని బస్సులను తిప్పుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మినీ బస్సులు జోరు ఎక్కువ ఉంది. పేరుకే మిని బస్సు కానీ ఒక్కో బస్సులో 20 నుంచి 25 మంది విద్యార్థు లను కుక్కుతున్నారు. ఈ బస్సులు సమీప గ్రామాల్లోని పిల్లలందరినీ ఎక్కించు కుని పాఠశాలలకు తీసుకొస్తున్నాయి. కానీ ఈ బస్సులకు ఫిట్‌నెస్ ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బడి బస్సులకు సంబంధించి ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 35 ప్రత్యేకంగా జారీ చేసింది. 32 అంశాలతో కూడిన నిబంధనలు అమలు చేయాలని సూచించింది. పాఠశాల, కళాశాల బస్సు ముందు భాగం ఎడమ పక్కన పేర్లు ఫోన్ నెంబర్లు ఇతర వివరాలు స్పష్టంగా రాసి ఉంచాలి. డ్రైవరు వయస్సు 60 ఏళ్లకు మించరాదు. ఆయన ఆరోగ్య పట్టికను విధిగా నమోదు చేయాలి. తల్లిదండ్రుల కమిటీకి డ్రైవర్ నియామకంపై వివరాలు తెలుపాల్సి ఉంటుం ది. బస్సు సామర్థ్యంపై పాఠశాల ప్రిన్సిపాల్ తల్లిదండ్రుల కమిటీ నెలకు ఓసారి పరిశీలించాలి. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల వివరాలు విధిగా నమోదు చేయాలి. ఒక అటెండర్‌ను తప్పనిసరిగా నియమించాలి. అత్యవసర ద్వారం ఉండాలి. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు వీలుగా అగ్నిమాపక సిలిండర్ అందుబాటులో ఉంచాలి. కానీ ఇవేవీ ప్రస్తుత బస్సుల్లో ఉండటం లేదు.


అరిగిపోయిన టైర్‌తో వెల్మల్‌కు వచ్చిన ఓ స్కూల్ బస్సు

ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపితే చర్యలు

జిల్లా రవాణాశాఖాధికారి వెంకటరమణ

జిల్లాలో మొత్తం 490 వరకు స్కూల్ బస్సులున్నాయి. ఇందులో 440 వరకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. మే 15వ తేదీకి కటాఫ్‌గా నిర్ణయించాం. ఆ తేదీలోగా అన్ని పాఠశాలలు తమ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సిందే. జిల్లాలో నిబంధనలకు అనుగుణంగా లేని 400 బస్సుల ఫిట్‌నెస్ రద్దు చేశాం. జీఓ 35 ప్రకారం నిబంధనలు అమలయ్యేలా చూస్తున్నాం.

సీట్లు 42.. విద్యార్థులు 65కు మించి

పరిమితికి మించి కుక్కుతున్న కార్పోరేట్ విద్యాసంస్థ

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల శివారులో ఓ కార్పోరేట్ స్కూల్.. తమ బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. స్కూల్ బస్సులో 42 సీట్లు ఉండగా.. పరిమితికి మించి 65 కంటే మించి విద్యార్థులను ఎక్కించుకోవడం గమనార్హం.

మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామం నుండి దాదాపు 5, 6 గ్రామాలల్లోని విద్యార్థులను బస్సులో పిల్లలను తీసుకెళ్తుంది. లాభార్జనే ధ్యేయంగా కనీస ప్రమాణాలు పాటించకుండా పిల్లల ప్రాణాలకు రక్షణ లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పోటీ ప్రపంచంలో తమ పిల్లల్ని ముందు ఉంచాలని స్కూల్, బస్సు ఫీజు భారమైనా సరే కాయాకష్టం చేసి తమ పిల్లలను ప్రయివేటు స్కూల్‌కు పంపిస్తుంటే.. పిల్లల మీద దయాదాక్షిణ్యం లేకుండా పరిమితికి మించి విద్యార్థులను బస్సులో కుక్కుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మోపాల్ మండల పరిధిలో దాదాపు వ్యవసాయ ఆధారిత కుటుంబాల పిల్లలు ఉన్నారు. పరిమితికి మించి తీసుకెళ్తున్న బస్సులో జరగరానిది ఏదైనా జరుగుతే పెను విషాదం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఆర్‌టీఏ అధికారులు కానీ పోలీసు అధికారులు కానీ స్పందించి పరిమితులకు మించి బస్సులో పిల్లల్ని తీసుకెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



మోర్తాడ్ గ్రామ పంచాయతీకి అవార్డు



నవతెలంగాణ-మోర్తాడ్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా మోర్తాడ్ గ్రామానికి ఉత్తమ అవార్డు వచ్చినట్లు సర్పంచ్ ధరణి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామపంచాయతీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, హోంమంత్రి మొహమ్మద్ అలీ చేతుల మీదుగా సర్పంచ్ ధరణి, కార్యదర్శి రామకృష్ణ ఉత్తమ సేవా పత్రాలను అందుకున్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన బీసీ నిరుద్యోగ అభ్యర్థులకు గురుకులం ఉపాధ్యాయుల పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్‌లో ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సి.హెచ్.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60 శాతంపైన మార్కులు ఉన్న అర్హులైన బీసీ అభ్యర్థులు సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ కాలేజీకి ఎదురుగా ఉన్న ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్ రెండవ అంతస్తులో గల బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్‌కు వచ్చి నేరుగా దరఖాస్తు అందజేసి తరగతులకు హాజరు కావాలని కోరారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్ 08462-241055కు సంప్రదించాలని తెలిపారు.

ఉత్తమ స్థాయిలో విద్యావ్యవస్థ

- కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఘనంగా విద్యా దినోత్సవం
- 'మన ఊరు మన బడి'లో నిర్మించిన గదులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు



ఆర్మూర్ : విద్యా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



బోధన్ : బోర్డుపై జై తెలంగాణ అని రాస్తున్న ఎమ్మెల్యే



డిచ్‌పల్లి : దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



వేల్పూర్ : విద్యా దినోత్సవంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ రూరల్ : మండలంలోని గుండారం ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడిలో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌళిక వసతుల కోసం నిర్మించిన గదులను రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : (పాటో) పట్టణంలోని రెండవ వార్డు ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ న్యాయవాది, మున్సిపల్ కౌన్సిలర్ కాందేశ్ సంగీత, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పిప్రి ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ ఆశాపురం దేవి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే మిర్జాపల్లి పాఠశాలలో విద్యా దినోత్సవంలో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థులచే ఉదయం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

అత్యుత్తమ స్థాయిలో విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే..

బోధన్ : రాష్ట్రంలో విద్యావ్యవస్థను అత్యుత్తమ స్థాయిలో తీర్చి దిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. మండలంలోని సంగెం గ్రామంలో, బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, పాండుఫారం, తీర్‌గల్లిలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా అధునాతన సౌకర్యాలతో రూపుదిద్దుకున్న పాఠశాలలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంఈఓ నాగనాథ్, ఎంపీపీ బుద్దే సావిత్రి, జడ్పీటీసీ లక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, మాజీ మండల రైతు సంఘం అధ్యక్షులు బుద్దె రాజేశ్వర్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాలూర మండలంలోని ఆయా గ్రామాలలో విద్యా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. డిజిటల్ తరగతి గదులను ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ సవిత, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్ధన్, పాఠశాల కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్, హెచ్ఎం సాయిలు, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు లింబూరి లక్ష్మణ్, వార్డు సభ్యులు సాయిలు, రిటైర్డ్ హెచ్ఎం గంగారాం, ఆలయ కమిటీ చైర్మెన్ శంకర్ పటేల్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

రైతుల సౌకర్యం కోసం ప్రభుత్వం నిర్మించిన గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షకీల్ అన్నారు. మంగళవారం మండలంలోని మినార్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన 200 మెట్రిక్ టన్నుల పరిమాణం గల గోదామును ఆయన ప్రారంభించి మాట్లాడారు.

కంఠేశ్వర్ : మన ఊరు మన బడి-మన బస్తీ మన బడి కార్యక్రమంలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలలను ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, దండు శేఖర్, సిర్ప రాజు, పంచారెడ్డి నర్సు భాయి సూరి, పోతుల పురుషోత్తం, మాకు రవి, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య..

ఎడపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో విద్యా దినోత్సవం నిర్వహించారు. అలాగే ఎడపల్లి మండల పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో మహిళా ప్రజాప్రతినిధులు నాయకులు పాఠశాల ఉపాధ్యాయ బృందం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

డిచ్‌పల్లి : కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు అన్ని సమకూర్చి ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యాబోధన చేస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించే విధంగా చూసే బాధ్యత ఉందని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మన ఊరు మనబడి పథకంలో భాగంగా ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో అదనపు తరగతి గదులు, వంట గది, తదితర వాటిని సర్పంచ్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ రఘునందన్ రాము, ఎంపీటీసీ డీకొండ సరిత సుధీర్, ఆర్అండ్‌బీ, నోడల్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు ఆలోచనతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలకు మనబడి మన ఊరు మనబడి పథకం కింద ఇందల్‌వాయి మండలంలోని 17 పాఠశాలలను మంజూరు చేశారని దానిలో భాగంగానే మల్లాపూర్‌లో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మన ఊరు-మన బడిలో భాగంగా మన ఊరు-మన బడిలో పనులు చేపట్టడానికి ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషితో మరమ్మతులు, ఇతర పనులకు గానూ 14 లక్షలు, కిచెన్ షెడ్ నిర్మాణానికి 4లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. మంజూరైన నిధుల నుంచి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసినట్టు తెలిపారు. అనంతరం హరిత హారంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో నోడల్ అధికారిని సంధ్యా నాయక్, మన ఊరు మనబడి ఇంచార్జ్ వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలివేరి గంగదాస్, సీనియర్ నాయకులు పాశంకుమార్, అరటి రఘు, మండల ఉపాధ్యక్షుడు బిరిష్‌శెట్టి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దూపల్లి పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు..

రెంజల్ : విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దూపల్లి పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం పలువురిని ఆకర్షించాయి. అనంతరం సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటలక్ష్మి, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయిరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెండోరా : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ విద్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కమ్మర్‌పల్లి : పాటో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని విద్యా దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ముప్కాల్ : విద్యాదినోత్సవం సందర్భంగా ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ఒగ్గుకథ రూపకంలో ప్రదర్శించారు. అదేవిధంగా పాఠశాలలో నూతనంగా డిజిటల్ క్లాసులను ఎంపీపీ సామ పద్మ వెంకట్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సైతం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా దశాబ్ది (పది సంఖ్య) రూపంలో కూర్చున్నారు. కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థులు డ్రాయింగ్, సైన్స్ కాంపిటేషన్, విద్యార్థులు ప్రదర్శించిన పలు అంశాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కేజీబీవీ పాఠశాలలో విద్యాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. తమ పాఠశాలకు సహాయ సహకారాలు అందించిన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ వినోద ఘనంగా సన్మానించారు.

వేల్పూర్ : మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యావేత్త అల్లకొండ రాకేష్ చంద్ర, ఎంపీటీసీలు గంగాధర్, గంగారెడ్డి ఎస్ఎంసీ చైర్మన్ రాము, గ్రామ కమిటీ సభ్యులు రఘు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అప్లయ్‌కి.. అనేక ఇబ్బందులు

- మీసేవల్లో కిక్కిరిసిన దరఖాస్తుదారులు



మీసేవకు తరలివచ్చిన దరఖాస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం ఆఖరి తేదీ ఉండటంతో మండలంలోని గుండారం మీసేవ వద్ద దరఖాస్తుదారులు మంగళవారం కిక్కిరిసారు. 'వారం రోజుల నుంచి మీ సేవ చుట్టూ తిరుగుతున్నాం. అయినా మాకు కులం, ఆదాయం సర్టిఫికెట్ రాలేదు. మీ సేవ సెంటర్ నిర్వాహకులకు అడిగితే సర్వర్ పనిచేయడం లేదని చెబుతున్నారు' అని తెలిపారు. కాగా దరఖాస్తులు గడువు 20 వ తేదీ ఉండటంతో పలువురు లబ్దిదారులు ఆందోళన చెందారు.

మానవ శరీరానికి యోగా ఎంతో అవసరం



యోగలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మానవ శరీరానికి యోగా ఎంతో అవసరమని వెల్‌నెస్ సెంటర్ ఇంచార్జ్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. నిజామాబాద్ నగరంలోని 44వ డివిజన్ ఖలీల్‌వాడీ ప్రాంతంలోని ఫ్రీడం పార్క్‌లో యోగ శిక్షకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు. జూన్ 21 యోగా దినోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్నెస్ సెంటర్ ఇన్చార్జి డాక్టర్ కృష్ణవేణి, యోగా శిక్షకులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో యోగ తో ఆరోగ్యకరంగాను, మానసికంగాను దృఢంగా ఉంటారని అన్నారు. ప్రస్తుత జీవితంలో యోగ శరీరానికి ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు. ఒత్తిడి, వృద్ధాప్యం, నిశ్చల జీవనశైలి లేదా సరికాని భంగిమలు, కదలిక అలవాట్ల కారణంగా శారీరక వశ్యత తగ్గుతుందని తెలిపారు. యోగా ఆసనాలు మరింత సరళంగా మార్చడానికి కీళ్ల, కండరాల కదలికను మెరుగుపరుస్తాయని, యోగాతో మెడ, భుజాలు, వీపు, తుంటి వంటి వశ్యతను మెరుగుపరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘన సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం బి సాంఘిక సంక్షేమ పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈనెల 13 నుంచి 17 వరకు తైవాన్ దేశంలో తైపిలో జరిగిన ఏషియన్ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో భారత జట్టు తరపున జిల్లా క్రీడాకారులు పాల్గొని తిరిగి వచ్చిన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంఘిక సంక్షేమ పాఠశాలల ప్రాంతీయ అధికారిని మేరీ ఏసు పాదం పాల్గొని క్రీడాకారులను ఘనంగా సన్మానించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భారత జట్టును సాంఘిక సంక్షేమ వివిధ పాఠశాలల క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమని, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగామోహన్, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, సాంఘిక సంక్షేమ పాఠశాలల జిల్లా అధికారిని సంగీత, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజరెడ్డి, సుద్ధపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి, తాడ్వాయి పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, జోష్న, సంధ్య, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఒకే దఫా రుణమాఫీ చేసి
కొత్త రుణాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

రైతులకు ఒకే దఫా రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. మంగళవారం పట్టణంలో తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం రైతులకండగా నిలబడతానని రుణమాఫీ లక్ష రూపాయలు చేస్తానని ఇప్పటివరకు చేయలేదని అన్నారు. ఒకే దఫా లక్ష రూపాయలు రుణమాఫీ చేసి కాలం పంటకి కొత్తగా రుణాలు లక్ష రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో తీసుకున్న రుణాలకు వడ్డీకి వడ్డీ బ్యాంకు వారు వేస్తున్నారని కొత్త రుణాలు ఇవ్వడం లేదని ఒకవైపు అతివృష్టి వలన పంటలు నష్టం జరిగినప్పటికీ రైతులు నష్టపోయారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోగట్టి భూమేశ్వర్, రైతులు పాపన్న, చిన్నయ్య, సత్యనారాయణ, కిరణ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సిద్ధల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన మహిళకు సన్మానం



మహిళను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన మండలం లోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన రాధారపు రాజకళను గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, ఉపసర్పంచ్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు రాజకళను శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి ఉన్నత చదువులు చదివి డాక్టరేట్ పొందిన రజకులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు కూడా డాక్టరేట్ అవార్డు సాధించిన రాజకళను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకొని గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని ఉపా కేసులన్నింటినీ ఎత్తివేయాలి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రంలోని ఉపా కేసులన్నింటినీ ఎత్తివేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్ సహా 152 మందిపై పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో ప్రొ.హరగోపాల్, ప్రొ.కాశీం, ఆల్గోట్ రవీందర్ తదితరులు 152 మందిపై దేశద్రోహం కేసులు నమోదు చేశారన్నారు. సమాజంలో గౌరవమున్న వ్యక్తులకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలు చేసి, దేశద్రోహం కేసును బనాయించడాన్ని సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్, ఆల్గోట్ రవీందర్, ఇతరులపై పెట్టిన దేశద్రోహం కేసులను ఎత్తివేయాలన్నారు. రాష్ట్రంలో అమలౌతున్న ఉపా చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తిన వారిపై దేశద్రోహం చట్టం కింద జైళ్ళల్లో పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడుతున్నామని దశాబ్ది ఉత్సవాల్లో ప్రకటించుకున్న రాష్ట్ర ప్రభుత్వం వామపక్షవాదులను, మేధావులను, ప్రజా సంఘాల నాయకులను టార్గెట్ చేసి, వారిపై కేసులు బనాయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం.నరేందర్, డివిజన్ కార్యదర్శులు ఎం.వెంకన్న, బి.దేవారం, డి.రాజేశ్వర్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా నాయకులు కే గంగాధర్, బి.మల్లేష్, సీ.హెచ్ సాయగౌడ్, పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సంధ్యారాణి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్, ఐ.ఎఫ్.టి.యు జిల్లా నాయకులు కిషన్, మురళి, కిరణ్, నాయకులు గంగమల్లు, శంకర్, మోహన్, నిఖిల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ కేత్ మండలాధ్యక్షులుగా కిషన్

నవతెలంగాణ-వర్ని

కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో వర్ని మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా శనిగరం కిషన్‌ను నియమించారు. ఈ సందర్భంగా కాసుల బాలరాజ్‌కు, సురేష్ బాబాకు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ-ముప్కాల్

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన పన్నీరు రేవతి (37) చెల్లెలకు భర్త పన్నీర్ కిషన్ రూ.రెండు వేలను సోమవారం పంపాడు. ఈ విషయంపై రేవతి తన భర్త కిషన్‌ను గట్టిగా నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరు భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రోజు వారీ సాధనలో భాగంగా భర్త కిషన్, పెద్ద కుమారుడు అభినయ్ వాకింగ్‌కు వెళ్లారు. వారు వచ్చి చూడగా.. ఇంట్లో ఉరివేసుకుని ఉంది. ఆమెను వెంటనే బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి ఆసుపత్రి సిబ్బంది సూచన మేరకు పెర్కిట్‌లోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కరాచారి తెలియజేశారు.

రేవతి మృతిపై పలు అనుమానాలు..

మృతి చెందిన పన్నీరు రేవతి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భర్త వేధింపులే ఆమె మృతికి కారణమంటున్నారు రేవతి కుటుంబ సభ్యులు. పోలీసులు ఆమె మృతిపై అనుమానాలను వెలికి తీయాలని కోరుతున్నారు.

ప్రతిపల్లెలో అభివృద్ధి

- నమస్తే నవనాథపురం'లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-నందిపేట్

ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధే నా ఏకైక కర్తవ్యమని, కేసీఆర్ దార్శనిక పాలనే తెలంగాణ భవితవ్యమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథపురం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తల్వేద గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఉదయం గ్రామంలోకి అడుగుపెట్టిన జీవన్‌రెడ్డికి ప్రజలు డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో గ్రామస్తులు, పలు కుల సంఘాలు, ప్రజా సంఘాల పెద్దలు జీవన్‌రెడ్డిని సత్కరించారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సభలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్వేద గ్రామం అభివృద్ధి, సంక్షేమ పథకాల మయంగా మారిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, ఎంపీపీ సంతోష్ రెడ్డి, జడ్పీటీసీ ఎర్రం యమున ముత్యం, తల్వేద సర్పంచ్ పీఎస్ సాయిరెడ్డి, ఎంపీటీసీ లింగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆకుల సాయిలు, పీఏసీఎస్ చైర్మన్ బొంకం గంగారెడ్డి, మాజీ ఎంపీపీ అంకంపల్లి రవి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజేశ్వర్, పెర్కిట్ సాయన్న, ఆవులాపురం సాయరెడ్డి, బద్దం సాయారెడ్డి, గంజాల భోజన్న, చిన్నారెడ్డి, బుద్దన్నగారి లింగారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుబాంధవుడు.. షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంట సబ్‌స్టేషన్ మర్రి వద్ద బుధవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఉమ్మడి రాష్ట్రంలో లో వోల్టేజ్ సమస్యను తీర్చడానికి రెండు, మూడు గ్రామాలకు సబ్ స్టేషన్లను ఏర్పాటు చేసి లో వోల్టేజ్ సమస్యను తీర్చిన రైతు బాంధవుడు షబ్బీర్ అలీ అని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. రైతులకు, ప్రజలకు కరెంట్ సమస్యలు తీర్చినందుకు షబ్బీర్‌అలీ చిత్రపటానికి నేడు(బుధవారం) ఉదయం9 గంటలకు పాలాభిషేకం చేయనున్నామని, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

నేడు కాలబైరవ స్వామి ఆలయానికి ఎమ్మెల్యే రాక

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇస్సన్నపల్లి-(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయానికి బుధవారం ఎల్లారెడ్డి నియోజకవర్గం శాసన సభ్యులు జాజాల సురేందర్ రానున్నట్టు ఆలయ ఈవో ప్రభు రామచంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, ఆధ్యాత్మిక దినోత్సవంలో ముఖ్యఅతిథిగా కార్యక్రమంలో పాల్గొననునట్లు తెలిపారు. కావున సందర్శకులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముదిరాజ్ బంధు అమలు చేయాలి

- కులస్తుల ర్యాలీ.. తహసీల్దార్‌కు వినతి



ర్యాలీ చేపట్టిన ముదిరాజ్ కులస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ముదిరాజ్ కులస్తులకు ముదిరాజ్ బంధు అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విఠల్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించి అనంతరం పెద్ద సంఖ్యలో గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి ముదిరాజ్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, బైండ్ల పోచన్న, ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు బట్టు విఠల్ హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎంతో వెనుకబడి వున్నారని షరతులు లేకుండా ముదిరాజ్ బంధు ద్వారా రూ.10 లక్షలు ఇవ్వాలని జి ఓ నెంబర్ 15 అమలు చేసి బిసి డి నుండి బిసి ఏ కు మార్చలని ముదిరాజ్ కార్పొరేషన్ ని 20 లక్షల కోట్లు కేటాయించలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజ్జన రమేష్ , ఎగుల నర్సింహులు, కోర్న నారాయణ, బాలయ్య, సాయిరాం, ఎల్లయ్య శ్రీకాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలుడికి మేము సైతం ఫౌండేషన్ ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని బాణాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మేము సైతం మై విలేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ బాలుడికి ఆర్థిక సహాయం మంగళవారం ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన బాలుడు బొల్లారం సాయికుమార్ తండ్రి సంగయ్య గతంలో చనిపోగా ఇటీవల తల్లి అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన అనాథగా మిగిలాడు. వారికి బంధువులు కూడా సహాయం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న మేము సైతం మై విలేజ్ ఫౌండేషన్ తరపున బాలుడికి రెండు జతల బట్టలు 50 కిలోల బియ్యం, ఇతర సామాగ్రి అతను చదువుకోవడానికి మా వంతు మేము సహాయం చేస్తామని ముందుకు రావడంతో మై విలేజ్ ఫౌండేషన్ను ప్రతినిధులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు అశోక్, సభ్యులు రవి, సంజీవులు, కృష్ణ, రాములు, గ్రామ సర్పంచ్ బండి కవిత, నర్సింలు, ఉప సర్పంచ్, హరి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అటెండర్ లక్ష్మణ్

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని భవిత సెంటర్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులకు దశాబ్ది ఉత్సవాలలో భాగంగా విద్యా దినోత్సవం పురస్కరించుకొని ఉన్నత బాలుర పాఠశాల అటెండర్ లక్ష్మణ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఓ డిసేబుల్ పర్సన్‌గా ఎన్ని ఇబ్బందులకు గురి కావలసి వస్తుందో తనకు తెలుసునని అన్నారు. అందుకుగాను పిన్ని వయసులో డిజేబుల్‌గా యుండి ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని విద్యనభ్యసిస్తూ వారికి బహుమతులను అందజేసినట్టు తెలిపారు. వారిని ఉత్తేజ పరచడం కోసం 15 వ ఆగస్టు , రిపబ్లిక్ డే సందర్భంగా దఫా దఫాలుగా తనకు తోచిన కాడికి ఏదో ఒక రూపంలో చేయూతనందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గణేష్ రావు, ఐఇఆర్పి టీచర్ కమల్ కిషోర్, ఆఫీస్ సిబ్బంది హైమద్ పాషా, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాజకుమార్

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జంలం గ్రామంలో గల ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో మోస్రా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, ఎడపల్లి మండలం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజకుమార్ పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ నివారణపై తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు, సూచనలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ గొడుగు రాజ్యలక్ష్మి హనుమంత్ అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఘనంగా విద్యాదినోత్సవం

- ఊరూరా స్కూళ్లల్లో జెండా ఆవిష్కరణ, ర్యాలీలు
- పలు చోట్ల డిజిటల్ బోర్డులు ఏర్పాటు
- జీపీల ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరులబృందం



గాంధారిలో..



జుక్కల్ మండలంలో జెండా ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూళ్లల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పలు స్కూళ్లల్లో డిజిటల్ బోర్డులు ప్రారంభించిగా, మరికొన్ని చోట్ల పంచాయతీల ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ప్రారంభించారు.

జుక్కల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఐదు జిల్లా పరిషత్ పాఠశాలలో, ప్రాథమికోన్నత, ప్రాథమిక, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో, బస్వాపూర్ కస్తూర్బా గురుకులంలో విద్యాదినోత్సవంలో సంధర్భంగా గ్రామస్తులు, విద్యాకమిటీ చైర్మన్‌లు, సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు విద్యార్థులతో కలిసి జాతీయ పతకాన్ని ఆవిష్కరించి గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర సాధనలో విద్యార్థుల పాత్ర ప్రధానంగా ఉందని, విద్యార్థులతోనే తెలంగాణ రాష్ట్ర సాధించుకున్నామని, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పలువురు సర్పంచ్‌లు పేర్కొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

జుక్కల్: మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో గ్రంథాలయాన్ని గ్రామ సర్పంచ్ వినోద్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంబించారు. సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ గ్రాంథాలయ శాఖ ద్వారా ఫర్నిచర్, పఠనం చేసే పుస్తకాలు సరఫారా చేశారని, గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేశామని, యువకులు, పెద్దలు నిత్యం గ్రాంథాలయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు సాయాగౌడ్, నీలుపటేల్, విజయ్ పటేల్, సదుపటేల్, శివాజీ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించడం అభినందనీయం

సదాశివనగర్: ఆదర్శ పాఠశాలలో జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించడం అభినందనీయమని జెడ్పిటిసి కమిలి నరసింహులు ఎంపీపీ గైని అనసూయ అన్నారు. మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదర్శ పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్తమ విద్యార్థులను సన్మానించి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానుమతి, వైస్ ఎంపిపి దారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మేనూర్ మోడల్ స్కూల్లో విద్యా దినోత్సవ వేడుకలు

మద్నూర్: మద్నూర్ మండలంలోని మేనూర్ మోడల్ స్కూల్‌లో విద్యా దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ వై గోవింద్, సర్పంచ్ విట్టల్, ఎంపీటీసీ సభ్యులు మందాకిని శ్రీనివాస్ గౌడ్, మండల ప్రజా పరిషత్ కోఆప్షన్ నెంబర్ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విద్య దినోత్సవం

సదాశివనగర్: మండలంలోని అన్ని పాఠశాలల్లో తెలంగాణ రాష్ట్ర విద్య దినోత్సవం నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. కారక్రమాల్లో ఎంపిపి గైని అనుసూయ, సర్పంచ్‌లు సంబు లలిత బాయ్, తిరుమల ఉపసర్పంచ్‌లు పశుల సాయిలు, రాజు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా విద్యదినోత్సవం

గాంధారి: గాంధారి మండల కేంద్రంలో విద్యా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో సేవ్ల, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్, మాతు సంగెం సర్పంచ్ కమ్మరి భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మేనూర్‌లో గ్రంథాలయం ప్రారంభం

మద్నూర్: మద్నూర్ మండలంలోని మేనూర్ గ్రామానికి నూతన గ్రంథాలయం మంజూరు అయింది. మంజూరైన గ్రంథాలయాన్ని ఆ గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సగభాగంలో ఒక పోర్షన్‌గా ఏర్పాటు చేసి నూతన గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. గ్రంథాలయ ప్రారంభోత్సవంలో గ్రామ సర్పంచ్ విట్టల్ గురుజీ, ఉపసర్పంచ్ మోహన్, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య, మద్నూర్ గ్రంథాలయ శాఖ అధికారి రాజు, ఆ గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్: లింగంపేట్ మండలంలోని అన్ని గ్రామాల్లో గల ప్రాథమిక, ఉన్నత, ఉచ్చతర పాఠశాలల్లో, గురుకులాల్లో, కేజీబీవీ, మైనార్టీ గురుకులాల్లో విద్యా దినోత్సవం పురస్కరించుకొని జాతీయ జెండాలను ఆవిష్కరించి విద్యార్థులతో ర్యాలీలు చేపట్టారు. లింగంపేట్ మండల కేంద్రమైన కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి ర్యాలీ నిర్వహించారు. జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి ఎంపీపీ గరీబునిసా నయీమ్, సర్పంచ్ బొల్లు లావణ్య చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలను దుస్తులను విద్యార్థులకు అందజేశారు.

డిజిటల్ బోర్డు ప్రారంభం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని మత్తామాల హై స్కూల్‌లో ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ డిజిటల్ బోర్డును ప్రారంభించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు

భిక్కనూర్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ తరగతులను ప్రారంభిస్తుందని భిక్కనూర్ పట్టణ సర్పంచ్ తునికి వేణు అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తరగతి గదిలో ఏర్పాటుచేసిన ఐఎఫ్ పి ప్యానెల్ డిజిటల్ టీవీ సర్పంచ్ ప్రారంభించారు. విద్యా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, నృత్య, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేశారు. పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోడ నరేష్, ఎంపీటీసీలు సువర్ణ ప్రభాకర్, చంద్రకళ రాములు, ఎస్ఎంసి వైస్ చైర్మన్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజమౌళి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉదయ్ దత్, హనుమంత్ రెడ్డి, యాదగిరి, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



భిక్కనూర్‌లో డిజిటల్ తరగతి బోర్డు ఏర్పాటు



లింగంపేట్‌లో విద్యార్థుల ర్యాలీ



మద్నూర్‌లో గ్రంథాలయం ఏర్పాటు

విద్యార్థులకు చదువే ఆయుధం

- విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం
- నాడు ఒకే కాలేజ్.. నేడు 30 కాలేజీలు
- 21న నిజాంసాగర్ నీటి విడుదల
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్ (బీర్కూర్)

విద్యార్థులకు చదువే ఆయుధమని, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బీర్కూర్ మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.1.61 కోట్లతో నూతనంగా అభివృద్ధి చేసిన మౌళిక వసతుల నిర్మాణాలను, 12 అదనపు తరగతి గదులను ప్రారంభించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ. 92.83 లక్షలతో అభివృద్ధి చేసిన మౌళిక వసతులు, 7 అదనపు గదులను, ఉర్దూ మీడియం పాఠశాలలో రూ.33 లక్షలతో నూతనంగా నిర్మించిన 3 అదనపు తరగతి గదులు ప్రారంభోత్సవం. రూ. 27 లక్షలతో నూతనంగా నిర్మించిన 3 అంగన్వాడీ భవనాలు ప్రారంభోత్సవం చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ పోచారం మాట్లాడుతూ విద్యా వ్యవస్థను బలోపేతం చెయ్యడం కోసం మన ఊరు-మన బడి మొదటి విడుతలో ప్రతి మండలానికి నాలుగు పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా అభివృద్ధి చేశామన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నాడు ఒకే కాలేజ్..నేడు 30 కాలేజీలు

బాన్సువాడ నియోజకవర్గం నుంచి 1994లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు నియోజకవర్గంలో కేవలం ఒక్కటే జూనియర్ కాలేజీ మాత్రమే ఉండేది. ఇప్పుడు అన్ని కాలేజీలు కలిపి 30 ఉన్నాయి. ఉర్దూ మీడియం జూనియర్, డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేశాం. ప్రభుత్వం బీఎస్సీ నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు.

'వానాకాలం పంటల సాగుకు డోకా లేదు. 21న ఉదయం నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి కాలువలకు నీటిని విడుదల చేస్తున్నాం. జూన్ 26 నుంచి వానాకాలం రైతుబంధు నిధులు రైతులకు అందుతాయి. అవసరమైతే కొండపోచమ్మ సాగర్ నుండి 5 టీఎంసిల గోదావరి నీళ్లను నిజాంసాగర్ ప్రాజెక్టుకు వదలమని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎంపిపీ రఘు, మాజీ జడ్పిటిసి సతీష్, అంజిరెడ్డి, వైస్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అశోక్, జడ్పిటిసి స్వరూప శ్రీనివాస్, గాంధీ, ఎంపిటిసి సందీప్, మండల కో ఆప్షన్ మెంబర్ అరిఫ్, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించండి

- డీఈవోకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి



డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడబ్లూజేఎఫ్ ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్‌కు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, రాంచందర్‌రెడ్డి విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతియేటా పెరుగుతున్న పాఠశాలల ఫీజులతో జర్నలిస్టు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ఫీజులతో గతంలో జర్నలిస్టులకు ఇస్తున్న 50 శాతం ఫీజు రాయితీతో ఉపయోగం లేకుండా పోయిందని వివరించారు. పైగా కొన్ని స్కూళ్లలో ఫీజు రాయితీని అమలు చేయడం లేదని డీఈఓ దష్టికి తీసుకెళ్లారు. చాలిచాలనీ వేతనాలతో, పెరిగిన నిత్యవసరాలతో జర్నలిస్టుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని వివరించారు. ఈ సమయంలో ప్రతియేటా పెరుగుతున్న ఫీజులు గుదిబండలా మారాయని తెలిపారు. ప్రయివేటు స్కూళ్లలో వంద శాతం ఉచితంగా జర్నలిస్టు పిల్లలకు విద్య అందించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీఈఓ జర్నలిస్టుల పిల్లలకు అన్ని స్కూళ్లలో రాయితీ అమలయ్యేలా చూస్తామని హామీఇచ్చారు. వంద శాతం ఉచిత విద్య అందించే విషయమై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యులు కుంచెం శ్రీనివాస్, సీనియర్ సభ్యులు రాకేష్, సురేష్, ప్రవీణ్, నవీన్ పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన కుమారుడు కోడలు రామకృష్ణారెడ్డి, తేజస్వీ దంపతులు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని హరిజనవాడ కాలనీలో ఉన్న ప్రైమరీ పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, ఉమా, స్వప్న, చేపూరి రాజు, పైతరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- జడ్పీ ఫ్లోర్ లీడర అంబర్‌సింగ్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిజామాబాద్ జిల్లా జడ్పి ఫ్లోర్ లీడర్, చందర్ జడ్పిటిసి అంబర్ సింగ్ తెలిపారు. మంగళవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నసురుల్లాబాద్ మండలానికి విచ్చేసిన నిజామాబాద్ జిల్లా జడ్పి ఫోరం లీడర్ అంబర్ సింగ్ ను మండల కాగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందు పటేల్ ఘనంగా సన్మానించారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించిన ఎన్రోలర్స్ సేవలను గుర్తించి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఎన్రోలర్స్ కి ప్రోత్సాహకాలు అందజేశారు. నసురుల్లాబాద్ మండలంలో 18 మంది కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం నమోదు చేసిన ఎన్రోలర్స్ కి ఒక్కొక్కరికి. జడ్పి ఫోర్ లీడర్ అంబర్ సింగ్ 5వేల చొప్పున నగదును అందించారు. కార్యకమంలో మండల అధ్యక్షులు నందు పటేల్, సర్పంచ్ అరిగెల సాయిలు, బొమ్మన్ దేవ్‌పల్లి సర్పంచ్ సత్యనారాయణ, మైనార్టీ నాయకులు యూసుఫ్, కలిమ్, చందూర్ మండల అధ్యక్షులు పోతరాజు శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, సాయగౌడ్, ప్రకాష్, సురేష్, గంగాధర్, రామన్న మహేందర్ చౌహాన్, లింగం, శివప్రసాద్, భాస్కర్‌గౌడ్, సత్యనారాయణ, కాంత్‌రెడ్డి, సరిచంద్, మోహన్, కృష్ణ, శ్రీనివాస్, నర్సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఫ్లోర్ లీడర అంబర్‌సింగ్

నేడు ఆధ్యాత్మిక దినోత్సవం

● ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా ప్రధాన మసీదులు, చర్చీలు, గురుద్వారాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు నిజామాబాద్ జిల్లా మైనారిటీస్ సంక్షేమశాఖ అధికారి డి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రధాన మసీదులు, చర్చీలు, గురుద్వారాలు తప్పకుండా సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దు

● మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్

నవతెలంగాణ-ఏర్గట్ల

నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడం వల్ల ఈ యేడు వర్షాలు ఇంకా మొదలు కాలేవని, కావున రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోకూడదని ఏర్గట్ల మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి పారుదల సమృద్ధిగా ఉండి ప్రస్తుతం నీరు సరిపోతున్న రైతులు మాత్రమే విత్తనాలు వేసుకోవాలని పేర్కొన్నారు. సరైన వర్షపాతం లేకున్నా, రైతులు విత్తనాలు వేస్తే ఎండ వేడికి అవి మొలకెత్తవని, తద్వారా రైతులు పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. సోయాబీన్ పంట మాత్రం రెండు, మూడు భారీ వర్షాలు పడ్డ తర్వాత, నేలలో తేమ వచ్చాకే విత్తుకోవాలని సూచించారు.

సర్వసభ్యంలో సమస్యల తిష్ట

- 'చెత్త కాలువ' సమస్యకు పరిష్కారం ఏది?
- కేజీబీవీని ఇంటర్ వరకు పొడగించాలి
- పలు సమస్యలు లేవనెత్తిన ప్రజాప్రతినిధులు
- ప్రయివేటులో ఫీజులను నియంత్రించాలని తీర్మానం

నవతెలంగాణ-నవీపేట్


సమస్యలు లేవనెత్తుతున్న ప్రజాప్రతినిధులు

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సమస్యల తిష్టతోనే కొనసాగింది. మండల కేంద్రంలో గ్రామ కంఠంలో గల ఇరిగేషన్ కాలువ చెత్తాచెదారంతో నిండి విపరీతమైన కాలుష్యాన్ని వెదజల్లడమే కాక వంట కాలువలకు సైతం సాగునీరు అందడం అనేక సమస్యలతో పరిష్కారం కాని సమస్యగా తిష్ట వేసిందని ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్ ఇరిగేషన్ ఏఈ శ్రీధర్‌ను ప్రశ్నించారు. గత కొన్ని సర్వసభ్య సమావేశాలలో ఈ సమస్యను పలుమార్లు దృష్టికి తీసుకువస్తున్నా పరిష్కారం చూపక గ్రామపంచాయతీ బాధ్యతలు తీసుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఎంపీపీ సంగెం శ్రీనివాస్ ఎంపీఓ రామకృష్ణ బాధ్యత తీసుకొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. అలాగే కేజీబీవీ పాఠశాలను ఇంటర్ వరకు పొడిగించాలని తెలపడంతో విద్యాశాఖ అధికారిని సానుకూలంగా స్పందించారు. ప్రైవేటు స్కూల్స్‌ల దోపిడీని అరికట్టాలని సభ దృష్టికి తీసుకురావడంతో తీర్మానం చేయడంతో పాటు డీఈఓ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పాఠశాలల వద్ద స్కూల్ జోన్లతో పాటు మండల కేంద్రంలో స్పీడ్ బేకర్లు వేయాలని డీఈ మోహన్ దృష్టికి తీసుకురావడంతో పోలీసుల పర్మిషన్ కావాలని తెలుపడంతో గత సర్వసభ్య సమావేశంలో ఈ విషయం చెప్పకుండా ఇప్పుడు చెప్పడం ఏంటని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తున్న మాటు కాలువల నిర్మాణం పూర్తి కాలేదని సిరన్‌పల్లి సర్పంచ్ సుధాకర్‌రావు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్‌ను ప్రశ్నించగా చివరి దశలో ఉన్నాయని వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. 45 వేల జనాభా గల మండలంలో కేవలం ఒకే ఒక ఆధార్ సెంటర్ ఉండడం అది కూడా సరిగ్గా సేవలు అందించకపోవడంతో ఇతర మండలాలకు ప్రజలు వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మండలంలో మరో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌ఐ మోహన్‌ను సభ్యులు కోరగా వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. మోకన్ గ్రామపంచాయతీ అంజుమన్ ఫారంలో స్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను పరిష్కారం చేయాలని సర్పంచ్ సుధాకర్ ఆర్ఐ దృష్టికి తీసుకువచ్చారు. శాఖలపై చర్చించి సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే విధంగా చూడాలని అధికారులను ఎంపీపీ సంగెం శ్రీనివాస్ ఆదేశించారు.

సరిపోని సర్వసభ్య సమావేశ హాల్..

మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ప్రతిసారి సమావేశ గది సరిపోక అధికారులు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 లక్షల మండల పరిషత్ నిధులతో ఎంపీడీవో కార్యాలయంపైన సమావేశ గది నిర్మాణం పూర్తయి ఎమ్మెల్యే షకీల్ ఆమెర్‌తో ప్రారంభానికి ముస్తాబై ఉంది. దశాబ్ది ఉత్సవాలలో ప్రారంభించాలని ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్యే సమయభావం కారణంగా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వైద్యశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ కుర్చీ తట్టుకొని పడిపోగా కాలికి బలమైన గాయమైంది. వచ్చే సర్వసభ్య సమావేశమైన నూతన సమావేశపు గదిలో జరుపుకోవాలని సభ్యులు ఆశిస్తున్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక


ఎమ్మెల్యేకు మెమోంటో అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టీవీ టెక్నికల్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో 100 మంది బీఆర్ఎస్‌లో మంగళవారం చేరారు. టీవీ టెక్నీషియన్ యూనియన్ సభ్యులకు సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. నిజామాబాద్ నగర అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌లో చేరడానికి బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మొదటిరోజు రజక సేవా సంఘం సభ్యులు, రెండవ రోజు టీవీ టెక్నీషియన్ యూనియన్ సభ్యులు చేరడం శుభ పరిమాణమని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సిర్ప రాజు, టీవీ టెక్నీషియన్ యూనియన్ సభ్యులు ప్రశాంత్, భూమేశ్వర్, శ్రీనివాస్, రాజు, మహేందర్, గంగాధర్, రాము తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ తండాలో తరగతి గది ప్రారంభోత్సవం


తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా టీఎస్ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం నిజామాబాద్ రూరల్ మండలంలోని గాంధీనగర్ తాండా గ్రామపంచాయతీ పరిధిలో ఎంపీపీ రూ.11లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన అదనపు పాఠశాల గదిని స్థానిక ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ నాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనూష లక్ష్మణ్ నాయక్, స్థానిక వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, పాఠశాల చైర్మన్ బసవయ్య, ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, ఉప సర్పంచ్ గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ రన్‌కు క్రీడాకారులందరూ హాజరవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు ఒలింపిక్ రన్‌కు క్రీడాకారులందరూ హాజరు కావాలని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి, బొబ్బిలి నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఒలంపిక్ సంఘం ఆదేశాల మేరకు బుధవారం (ఈనెల 21న) ఒలంపిక్ రన్ ఉన్నందున జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులందరూ హాజరు కావాలని కోరారు. ఈ ఒలంపిక్ రన్ ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నగర మేయర్, జెడ్పి చైర్మన్ విట్టల్ రావు, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హాజరవుతారని అన్నారు. అదేవిధంగా జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొని ఒలంపిక్ రన్ ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమం ఉదయం 9:30కి రాజరాజేంద్ర టాకీస్, పెద్దబజార్, హెడ్ పోస్ట్ ఆఫీస్, నెహ్రూ పార్క్, బస్టాండ్, తిలక్ గార్డెన్ మీదుగా కలెక్టర్ గ్రౌండ్ చేరుకొని, అక్కడ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అందుకు జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ మేక విజయ సంతోష్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను మండలంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ముందుగా పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం, ఎస్ఎంసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ నాగరాజు, షీలా, రెంజల్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10/10 జీపీఏ సాధించిన విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవం సందర్భంగా సాలురా మండలం హున్సా పాఠశాలలో 10.10 జీపీఏ సాధించిన విద్యార్థిని సిరిసే ప్రణవిని మంగళవారం బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, సాలూర మండలం తహసీల్దార్ మమత ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసి డిజిటల్ క్లాస్‌లు ప్రారంభించారు. బోధన్ డివిజన్‌లోనే ప్రభుత్వ పాఠశాలలో 10 జీపీఏ సాధించడంతో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మన ఊరు మన బడి ద్వారా పాఠశాల నిర్మాణం కొరకు బోధన్ ఎమ్మెల్యే ఎండీ.షకీల్ ఆమ్మేర్ కోటి రూపాయలు నిధులను మంజూరు చేశారని ఎంపీపీ అన్నారు. విద్యార్థినికి తహసీల్దార్, ఎంపీపీ, సర్పంచ్, సహకార సంఘం చైర్మన్‌లు కలిసి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పర్బన్న, ఎంపీటీసీ ఎం.శివకుమార్, సహకార సంఘం చైర్మన్ మందార్న రవి, వైస్ చైర్మన్ వినోద్ బాబా డైరెక్టర్ నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి

నవతెలంగాణ-ఆర్మూర్


గంజాయితో పట్టుబడ్డ యువకుడు

ఆర్మూర్ పట్టణం నుంచి పిప్రి వెళ్లే రోడ్డుమార్గంలో పెట్రోల్ బంక్ సమీపాన గస్తీ నిర్వహిస్తుండగా సునీల్ రోహిదాస్ వాకుడే అనే వ్యక్తి పల్సర్ బైక్‌పై గంజాయితో పట్టుబడ్డట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ మంగళవారం తెలిపారు. మొత్తం 156 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. దాడిలో ఎస్ఐ ఏ. గంగాధర్, జె.ప్రమోద్ చైతన్య, బి.చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుల్స్ గంగాధర్‌గౌడ్, బండి నారాయణ, కానిస్టేబుల్స్ కె.ధర్మేందర్, డి.సాయిబాబా, మోహన్, దేవదాస్, సందీప్, వికాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్ట్ టైం లెక్చరర్‌లను రెగ్యులరైజ్ చేయాలి

● టీయూలో నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి



లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని నిరసన

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చర్లకు రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరుతూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్ట్ టైం లెక్చర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ డి.ప్రసన్న మాట్లాడుతూ.. పార్ట్ టైం లెక్చరర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలి లేదా ఉద్యోగ భద్రతను కల్పించాలని, సంవత్సరంలో కేవలం కొద్ది రోజులు మాత్రమే వర్క్‌లోడ్ లభిస్తుందని, తద్వారా పార్ట్ టైం ఫ్యాకల్టీ చాలా నష్టపోతున్నారని వివరించారు. ఈ నిరసన కార్యక్రమానికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అసోసియేషన్ మద్దతు పలుకుతూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నట్టు ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ దత్త హరి మాట్లాడుతూ.. పార్ట్ టైం అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లకు తాము కూడా అండగా నిలుస్తామని రెండు అసోసియేషన్లది ఒక్కటే డిమాండ్ అని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్ తాహేర్, అరిగెల హరిత, రఘువీర్, గంగాధర్ శ్రీనివాస్, కనకయ్య చౌహన్ ఆఫ్రిన్, లింగమూర్తి, శీనునాయక్, శ్రీకాంత్‌గౌడ్, నరేందర్, నవీన, గణేష్‌నాయక్, కిషన్, విజయ్, సునీల్, విద్యార్థి నాయకులు సంతోష్, శివ, నవీన్, సాయి, పవన్ పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్యను పెంచాలి

● బోధన్ జిల్లా ఆస్పత్రిలో కార్మికుల ధర్నా

నవతెలంగాణ-బోధన్


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బోధన్ జిల్లా ఆసుపత్రిలో కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆస్పత్రి ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ శివశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.ఓమయ్య మాట్లాడుతూ.. బోధన్ జిల్లా ఆస్పత్రికి ప్రస్తుతమున్న బోధన్ పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి అవుట్ పేషంట్స్ (ఓపి), ఇన్ పేషెంట్స్ (ఐపి) కొరకు పేషెంట్లు పెరుగుతున్నందున బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిని 250 పడకలకు పెంచాల్సిన అవసరం ఉన్నదని, దీంతోపాటు ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రధానంగా ఆస్పత్రిలో కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న వేతనం వెంటనే ఇవ్వాలని, 2023 మే 1న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ నెలకు వెయ్యి రూపాయలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శంకర్, సాయిలు, నాగమణి, నయీమ్, సద్దాం, అఫ్రోజ్, దేవేందర్, సతీష్ పాల్గొన్నారు.

రాజ్యాంగం మనువాదం అనే అంశాలపై సెమినార్

నవతెలంగాణ-కంఠేశ్వర్



సెమినార్‌లో మాట్లాడుతున్న కొండ గంగాధర్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుబ్బ ప్రాంతంలో మనువాదం, రాజ్యాంగంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా మనువాదము భావవాదము అనేది దేశ ప్రజల్లో నాటుకుపోయిన పరిస్థితి మూఢనమ్మకాలు, మూఢాచారాలు కూరుకుపోతున్న సందర్భంగా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ బలమైనదిగా రాజ్యమేలుతున్నదన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలో పాతుకుపోయిన పరిస్థితి ఉన్నదని వివరించారు. శాస్త్రీయ దృక్పథంతో కండ్లకు అద్దినట్టు కనపడుతున్నప్పటికీ నమ్మలేని పరిస్థితి కనబడుతున్నదని తెలిపారు. భారత రాజ్యాంగం శాస్త్రీయ దృక్పథం తోటి ప్రపంచ మేధావుల తోటి ఆలోచించి దేశాభివృద్ధి సామాజిక అభివృద్ధి ఆర్థిక అభివృద్ధి సమాజంలో మార్పు కొరకు అనుభవంతోటి రాసిన రాజ్యాంగాన్ని ప్రమాదం కలిగి ఉందని గ్రహించాలన్నారు. రాజ్యాంగమే ముద్దు మనువాదం వద్దు అనే విషయాన్ని దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. చాతురు వారిన వ్యవస్థను కూలదోయాలని, చట్టం ముందు అందరూ సమానులేనని భావించాలని బోధించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల్ నరసయ్య, జిల్లా కమిటీ సభ్యులు, ఎస్టీలు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ద్యారంగుల కృష్ణ, దళిత నాయకులు శ్రీకాంత్, అధ్యక్షురాలు ట్రాన్స్‌ఫోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు కటారి రాములు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అత్యధిక అవార్డులు

నవతెలంగాణ-బోధన్


అవార్డులు అందుకుంటున్న బోధన్ లయన్స్ క్లబ్

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ జిల్లా 320డీలోనే అత్యధిక అవార్డులు సాధించినట్టు క్లబ్ ప్రతినిధులు లక్ష్మీ, బసవేశ్వరరావు, కొడాలి కిషోర్, శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని విశ్వనాథ గార్డెన్‌లో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 డీ ఆధ్వర్యంలో కనెక్ట్ అవార్డ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతి సంవత్సరం ఎన్నో విశిష్ట సేవా కార్యక్రమాలను నిర్వహించి బీదవారిని ఆదుకుంటున్నారని తెలిపారు. అలాగే 2020-21 సంవత్సరంలో జిల్లాలోని 160కి పైచిలుకు లయన్స్ క్లబ్‌లలో అత్యధిక సేవా కార్యక్రమాలను నిర్వహించి అత్యధికంగా 26 అవార్డులను కైవసం చేసుకున్నట్టు ప్రతినిధులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అధ్యక్షులు లయన్ ప్రతాప్ గుప్తా మాట్లాడుతూ.. ఇన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి క్లబ్‌లో ఉన్న మాజీ గవర్నర్ లయన్ పోలవరపు బసవేశ్వరరావు, లయన్ కోడాలి కిషోర్, లయన్ వై.శ్రీనివాసు, లయన్ టి.నరసింహారెడ్డి, క్లబ్ కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి సురేంద్ర చౌదరి, సీనియర్ సభ్యుల సహకారాలతోనే ఇన్ని సేవా కార్యక్రమాలు చేయడం, ఇన్ని అవార్డులను గెలుచుకున్నట్టు తెలిపారు. అదేవిధంగా 2021-22 సంవత్సరంలో గవర్నర్‌గా ఉండి ఈ క్లబ్ ద్వారా చేసిన కార్యక్రమాలను గుర్తించి ఇన్ని అవార్డులు ఇచ్చిన గవర్నర్ లయన్ గంధాని శ్రీనివాస్‌కు క్లబ్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

మల్లారంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్


పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల యందు స్థానిక ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్‌నాయక్ దాదాపుగా 260 మంది బడి పిల్లలకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచ్ నగేష్, పాఠశాల టీచర్ ఇంచార్జ్ హెచ్ఎం భూమాగౌడ్, ఎస్టీ సెల్ మండలాధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, ఉప సర్పంచ్ రవి, గ్రామశాఖ అధ్యక్షులు గాజుల శంకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు నగదు అందజేత


టాపర్‌కు 5 వేల నగదు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో మండల టాపర్ షేక్ ఇజార్‌కు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు ఎమ్మెస్ రమేష్ కుమార్ రూ.5వేల నగదుతో పాటు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అంకితభావంతో విద్యను అభ్యసించాలని, ఉత్తమ ర్యాంకులు సాధించి మండలానికి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాంకు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ముమ్మాయి నాగరాజుకు, శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నప్ప, సంతోష్, సురేష్, సుష్మ, అరుణ జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఎస్ఎంసి కమిటీ ఉపాధ్యక్షురాలు షీలా, కమిటీ సభ్యులు సిద్ధ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మకంగా పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బిఎ, బికాం, డిఎస్‌సి, బిబిఎ 2వ, 4వ, 6వ సెమిస్టర్ (రెగ్యులర్) ప్రయోగాత్మక పరీక్షలు తెలంగాణ యూనివర్సిటీలోని అనుబంధ కళాశాలలో 10 జూన్ నుంచి ప్రారంభమై 25 జూన్ వరకు కొనసాగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.telangana University.ac.inను సంప్రదించాలని సూచించారు.